క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సదానందం

భీమారం: మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సదానందం మంగళవారం తనిఖీ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రాలను త్వరగా మూసి వేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కాగా తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. భీమారంతోపాటు పోలంపల్లి, ఆర్కెపల్లి కేంద్రాలను సందర్శించారు. అదేవిధంగా మంచిర్యాల ఆర్డీవో రాములు ధాన్యం కొనుగోలుపై తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కోటపల్లి: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్డీవో రాములు పేర్కొన్నారు. మండలంలోని పార్‌పల్లి, ఆలుగామ ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. అకాల వర్షాల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని కేంద్రాల్లో గన్నీబ్యాగుల కొరతను వెంటనే పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ మహేంద్రనాథ్, ఆర్ఐ రాజలింగు ఉన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వేమనపల్లి: మండలంలో వరిధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న ధాన్యం కొనుగోళ్లు సరిగ్గా జరగడం లేదన్నారు. ఒక్కో బస్తాకు 5 కిలోల కోత విధిస్తూ రైతులను నట్టేటా ముంచుతున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు చేపట్టాలని కోరారు.

చెన్నూర్ ఎమ్మెల్యేకు స్వాగతం



పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే ఓదెలు

మందమర్రిరూరల్: చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ అమెరికా వెళ్లి తిరిగి మంగళవారం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆయన్ను మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, పలువురు కాంగ్రెస్ నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధిపై శిక్షణ



శిక్షణకు వెళ్లిన అధికారులు

భీమారం: పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామాల అభివృద్ధి అంశంపై హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో రాధారాథోడ్, ఎలకేశ్వరం పంచాయతీ కార్యదర్శి శ్రావ్య పాల్గొన్నారు. శిశు సంక్షేమంతోపాటు పారిశుధ్యంపై ఎలకేశ్వరం పంచాయతీని ప్రభుత్వం ఎంపిక చేసిందని ఎంపీడీవో తెలిపారు. ఈమేరకు ఆయా రంగాల్లో ఎలాంటి పనులు చేపట్టాలనే విషయాన్ని శిక్షణ ద్వారా ఇస్తున్నారని అన్నారు.

వెంకటాచల మహాత్మ్యాన్ని తెలుసుకోవాలి

చెన్నూర్: హిందు బంధువులందరు వెంకటాచల మహాత్మ్యాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు, భారతీ తీర్థ పుష్కర గ్రహీత బాచంపల్లి సంతోశ్‌కుమార్ శాస్త్రి అన్నారు. చెన్నూర్ జగన్నాథాలయంలో పులి దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలో వేంకటేశ్వర వైభవ కథాసప్తాహం మంగళవారం ప్రారంభమైంది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వచ్చే నెల 3 వరకు సప్తాహం కొనసాగనుంది. అర్చకులు దామెర మోహనాచార్యులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ నిల్వలు సీజ్

నస్పూర్: పట్టణ పరిధిలోని ఇసుక అక్రమ నిల్వలపై అధికారులు కొరడా ఝులిపించారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సీతారాంపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను రెవెన్యూ, మైనింగ్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. అధికారులు శ్రావణ్‌కుమార్, మాంతయ్య, చందర్ తదితరులు ఉన్నారు.

గొంతెండుతోంది..!

- పల్లెల్లో తాగునీటి ఎద్దడి
- ప్రత్యేకపాలన అస్తవ్యస్తం
- పట్టింపులేని అధికారులు



ఆకెనపల్లి పంచాయతీ నేతకానివాడలో మహిళలు ఖాళీబిందెలతో నిరసన



నీటి ట్యాంక్

బెల్లంపల్లిరూరల్: పల్లె 'గొంతు'తడారుతోంది. పల్లె వాసుల గొంతెండుతున్న పట్టించుకునేనాథుడే కరువయ్యారు. దశాబ్దాలుగా పల్లెల్లో నీటిఎద్దడితో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రస్తుత ప్రత్యేక అధికారుల పాలన మరింత అస్తవ్యస్తంగా తయారైంది. తాగునీరందక ప్రజలు తల్లడిల్లుతున్నా అధికార యంత్రాంగం మాత్రం పట్టింపులేని ధోరణిని అవలంబించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. బెల్లంపల్లి మండల పరిధిలో 17 పంచాయతీలు ఉండగా 35 గ్రామాలు ఉన్నాయి. పాత బెల్లంపల్లి, ఆకెనపల్లి, బుచ్చయ్యపల్లి, చంద్రవెల్లి, చాకేపల్లి, పెర్కపల్లితోపాటు ఆయా గ్రామాల్లో తీవ్ర నీటి సమస్యతో గ్రామీణ ప్రజలు సతమతమవుతున్నారు. అసలే వేసవికాలం, ఆపై తీవ్ర నీటిఎద్దడి కారణంగా ప్రజలు బోరుబావులను ఆశ్రయిస్తున్నారు. కనీసం నీటి సరఫరా సరిగా లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో ప్రజలు..

తాగునీటి సమస్య జఠిలం కావడంతో ప్రజలు ఆందోళన బాటపట్టారు. మంగళవారం ఆకెనపల్లి పంచాయతీ పరిధి నేతకానివాడలో మహిళలు ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అధికారులు, నాయకులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

'భగీరథ' ప్రయత్నమే..

తాగునీటి కోసం ప్రజలు ×భగీరథ¶ప్రయత్నం చేయక తప్పడం లేదు. మండల పరిధిలో 59 మిషన్ భగీరథ ట్యాంకులు ఉన్నాయి. ఇంటింటికీ వారానికి, పక్షం రోజులు, నెలకోసారి వచ్చే నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వచ్చిన నీరు మురికిగా, దుర్వాసన వస్తున్నాయని వాపోతున్నారు. గ్రామాల్లో డైరెక్ట్ పంపింగ్ సిస్టమ్, చేతిపంపులు అరకొరగా ఉన్నాయి. బావుల్లో నీరు ఇంకి బోరుబావుల నీరు సరిగా అందకపోవడంతో ప్రజలు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు.

నీళ్లు వస్తలేవు



గ్రామంలో రోజువారీగా భగీరథ నీళ్లు వస్తలేవు. ఎప్పుడో వారానికోసారి వస్తున్నయి. అవి కూడా మురికిగా రావడంతో ఇబ్బంది పడుతున్నాం. నీళ్ల కోసం గోసైతంది. అధికారులు రోజు నీళ్లు అందించి మా గోస తీర్చాలి.

– జాడి పద్మ, నేతకానివాడ, ఆకెనపల్లి

భగీరథ కనెక్షన్ ఇవ్వాలి



మాకు ఇప్పటివరకు మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వలేదు. సార్లను అడిగితే రేపు మాపు అంటున్నరు. ఎండకు నీళ్ల కోసం బాగా తిప్పలు పడుతున్నం. బోర్ల దగ్గర నీళ్లు పట్టుకుంటే అవి పుష్కలంగా అస్తలేవు. భగీరథ కనెక్షన్ ఇచ్చి, రోజు నీళ్లు ఇయ్యాలె.

– చింతం శంకరమ్మ, పాతబెల్లంపల్లి

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. రోజువారీగా నీటిని సరఫరా చేస్తున్నాం. కొన్ని సందర్భాల్లో నీటిని సరఫరా చేయలేకపోతున్నాం. రోజువారీ నీటి సరఫరా కోసం భగీరథ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. తాగునీటి సమస్యను పరిష్కరించి గ్రామీణుల ఇబ్బందులు తొలగించడానికి కృషిచేస్తాం. – శ్రీనాథ్, ఏఈ మిషన్ భగీరథ, బెల్లంపల్లి

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి



బెల్లంపల్లిరూరల్: పనులు పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: అమ్మ ఆదర్శపాఠశాల పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో ఆర్.మహేందర్, తహసీల్దార్ కె.వై ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పాతబెల్లంపల్లి, పెద్దబుచ్చ, ఆకెనపల్లి పంచాయతీ నేతకానివాడ, లింగాపూర్, మాలగురిజాల, రంగపేట, బుధాకలాన్ గ్రామాల్లో చేపడుతున్న పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులను కాంట్రాక్టర్లు నాణ్యతతో చేపట్టి గడువులోగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభంలోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈడబ్ల్యూఎస్ ఏ.ఈ వినయ్‌కుమార్, ఐకేపీ ఏపీఎం శ్యామల, ఐకేపీ, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల పనుల పరిశీలన

కాసిపేట: మండలంలోని కాసిపేట జెడ్పీ, టీజీఎంఎస్ కాసిపేట, ఎంపీపీఎస్ చింతగూడ, పోలీస్‌స్టేషన్ బస్తీలోని పాఠశాలల్లో పనులను నోడల్ అధికారి రమేశ్ మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు యూని ఫారాలు కుడుతున్న ముత్యంపల్లి, దేవాపూర్ కేంద్రాలను పరిశీలించారు. కాసిపేట జెడ్పీ హెచ్ఎం సాంబమూర్తి, సీఆర్పీ రమేశ్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న రాజమల్లు, పాల్గొన్న నాయకులు

దండేపల్లి: ఏజెన్సీ గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ వార్డు సభ్యుల రిజర్వేషన్‌ను అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోళ్ల రాజమల్లు డిమాండ్ చేశారు. దండేపల్లిలో ఎస్సీ, అనుబంధ సంఘాల నాయకులతో మంగళవారం సమావేశమై మాట్లాడారు. పంచాయతీరాజ్ చట్టం ద్వారా 2018 పంచాయతీ ఎన్నికల్లో ఏజెన్సీ గ్రామాల్లో ఎస్సీ వార్డు సభ్యుల రిజర్వేషన్ తొలగించి, ఎస్సీలకు అన్యాయం చేశారని ఆరోపించారు. పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి, రానున్న ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఏజెన్సీ గ్రామాల్లో వార్డు స్థానాల్లో ఎస్సీల రిజర్వేషన్‌కు అవకాశం కల్పించాలన్నారు. గిరిజనులు లేని ఏజెన్సీ గ్రామాల్లో ఎస్సీలకు అవకాశం ఇవ్వాలన్నారు. మాలమహానాడు మండల అధ్యక్షుడు దయాకర్, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు నరేశ్, నేతకాని సంఘం నాయకులు రాయలింగు, సత్తయ్య, దైవకర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్లెప్పుడు కొంటరు..

- తహసీల్దార్‌కు రైతుల మొర

వేమనపల్లి: కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి కళ్లల్లో అడ్లరాసులు పెరుగుతున్నయ్.. ఎప్పుడు వడ్లు కొంటరని రైతులు కొత్తపల్లి వరి కొనుగోలు కేంద్రం వద్ద రైతులు తహసీల్దార్ రమేశ్‌కు మొరపెట్టుకున్నారు. కోతలు పూర్తయి నెల రోజులు గడుస్తున్నా తమకు గన్నీబ్యాగులు ఇవ్వడం లేదని లారీలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో బ్యాగుకు 5 కిలోలు కోత పెడితేనే వడ్లు కొంటామని మిల్లర్లు, కేంద్రం నిర్వాహకుడు అంటున్నారని తెలిపారు. దీంతో తహసీల్దార్ అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడు గన్నీ సంచులు వచ్చేలా చొరవ తీసుకున్నారు. కోతలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

నకిలీ విత్తనాలు కొనుగోలు చేయొద్దు



బిట్టూర్‌పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

భీమిని: రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని భీమిని ఏడీఏ ఇంతియాజ్ అహ్మద్, ఏవో విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బిట్టూర్‌పల్లి, వడాల గ్రామాల్లోని రైతులకు విత్తనాల ప్రాముఖ్యత వాటి లాభాలు తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైతులు తప్పనిసరిగా విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రషీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఏఈఓలు వినోద్, కార్తీక్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

కాసిపేట: కోనూర్, కనికలాపూర్, వరిపేట గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోళ్లపై ఏవో వందన అవగాహన కల్పించారు. లూజు సంచులలో విత్తనాలు కొనుగోలు చేయొద్దన్నారు. ఏఈవోలు అంజలి, రమ్య, రైతులు పాల్గొన్నారు.

తాండూర్: అచలాపూర్, మాదారం, కత్తెర్ల, బోయపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో కిరణ్మయి మాట్లాడుతూ రైతులు లైసెన్సులు కలిగిన ఫెర్టిలైజర్ షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఏఈవోలు శంకర్, ధనలక్ష్మి, పుష్పలత, సిబ్బంది ఉన్నారు.

కోటపల్లి: నకిలీ విత్తనాల పట్ల రైతుల అప్రమత్తంగా ఉండాలని ఏవో మహేందర్ సూచించారు. నాగంపేట, బోప్పారం,రాపన్‌పల్లి, ఎసన్‌వాయి గ్రామాల్లో వ్యవసాయశాఖ అధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఈవోలు వైష్ణవి, రాజుకుమార్, అనూష, శేఖర్ పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విత్తన కొనుగోళ్లలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓలు శ్రీనిక, కనకరాజు, మౌనిక పేర్కొన్నారు. నంనూర్, గుడిపేట గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించారు. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి పూర్తి వివరాలతో రసీదు పొందాలన్నారు.

పోచమ్మ మత్తడి కాలువ పరిశీలన



పరిశీలిస్తున్న తహసీల్దార్, ఇరిగేషన్ ఇంజనీర్

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ చెరువు మత్తడి కాలువను ధ్వంసం చేసిన ప్రాంతాన్ని తహసీల్దార్ రమేశ్, ఇరిగేషన్ ఇంజనీర్ గౌతమ్ మంగళవారం పరిశీలించారు. ఇటీవల కాలువను కొందరు ధ్వంసం చేసిన విషయమై కలెక్టర్ సంతోశ్‌కు బీజేపీ నేత తులా మధుసూదన్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు ఆయనతో కలిసి కాలువను పరిశీలించిన అనంతరం మున్సిపల్ కమిషనర్‌తో కలిసి నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రియల్ వ్యాపారులు చెరువును కబ్జా చేసేందుకు గాను మత్తడిని విధ్వంసానికి గురిచేశారని, అధికారులు విచారణ చేపట్టాలని తుల మధుసూదన్ కోరారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలి

భీమారం: మండలంలో రెవెన్యూశాఖ ద్వారా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్ కోరారు. స్థానిక తహసీల్దార్ సదానందంని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంక్‌లో రక్త నిల్వలు తక్కువ ఉన్నందున తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల కోసం ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పించి స్వచ్ఛందసంస్థల ద్వారా శిబిరాలు నిర్వహించాలని కోరారు. డీటీ కృష్ణ, ఆర్ఐ శ్రావణి ఉన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



మంచిర్యాలలో పూలమాలలు వేస్తున్న బోడ జనార్దన్

మంచిర్యాలఅర్బన్/లక్సెట్టిపేట/బెల్లంపల్లి/మందమర్రిరూరల్/పాతమంచిర్యాల: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ ఎన్టీఆర్ 101 జయంతిని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. మాజీ మంత్రి బోడ జనార్దన్, టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్‌కుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, కమ్మసంఘం అధ్యక్షుడు మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు. లక్సెట్టిపేటలో జరిగిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ నాగభూషణం పాల్గొన్నారు. బెల్లంపల్లిలోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. మణిరాంసింగ్, మల్లయ్య, రమేశ్, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు. మందమర్రిలోని టీఎన్టీయూసీ ఆఫీస్‌లో జరిగిన వేడుకల్లో టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో కమ్మసేవా సమితి మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల గౌరవ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, కోశాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల శోభాయాత్ర



జైపూర్: ఇందారం వేణుగోపాలస్వామి ఆలయంలో హోమం



భీమారం: శోభాయాత్ర పాల్గొన్న భక్తులు

భీమారం: పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం హనుమాన్ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. గ్రామ పురవీధులు, పద్మశాలి వీధి, బస్టాండ్ మీదుగా ఆవిడం రోడ్డు వరకు ఈ యాత్ర కొనసాగింది. కాగా చిన్నారి బాలుడు హనుమంతుని వేషధారణతో అందరినీ ఆకట్టుకున్నాడు.

జైపూర్: ఇందారం గ్రామంలో హనుమాన్ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో హోమం చేపట్టారు. ప్రత్యేక పూజ కార్యక్రమంలో దీక్షాస్వాములు పాల్గొని ఆంజనేయ స్వామికి అభిషేకం చేశారు. అనంతరం సాయంత్రం భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో భారీ హన్‌మాన్ విగ్రహానికి పూజలు చేశారు.

ఘనంగా హనుమత్ యజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న వేద పండితుడు ఫణి కుమార్‌శర్మ దంపతులు

శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీరామ సహిత హనుమత్ మహా యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. హనుమాన్ సేవాసమితి ఆధ్వర్యంలో స్వాములు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అదనపు కలెక్టర్ రాహుల్, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి దంపతులు, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, కొక్కిరాల రఘుపతి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రమేశ్, నరేశ్ హాజరయ్యారు. పూర్ణాహుతి సమయంలో జైశ్రీరామ్ నినాదంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. యజ్ఞం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. స్వాములకు భిక్షా, భక్తులకు అన్నదానం చేపట్టారు.

రామయజ్ఞం..



రామయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

జన్నారం: మండలంలోని కలమడుగు ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు రామయజ్ఞం నిర్వహించారు. పురోహితులు కాకర నర్సయ్య, రాజనరేంద్రశర్మ ఆధ్వర్యంలో హోమాలు చేపట్టారు. దీక్ష చేసుకున్న 122 మంది దీక్షాపరుల రామనామస్మరణతో భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ఆర్కెస్ట్రా కళాకారుడు శంకర్ ఆధ్వర్యంలో భజన చేపట్టారు. రామనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కోరం లేక సమావేశం వాయిదా

తాండూర్: మండల సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సిన సమావేశానికి సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు సూపరింటెండెంట్ వేణుగోపాల్ ప్రకటించారు. సమావేశానికి కొత్తపల్లి ఎంపీటీసీ రెబ్బెన యశోద తప్ప ఎవరూ హాజరుకాలేదు.

మిట్టపల్లి పంచాయతీ తనిఖీ

జైపూర్: మండలంలోని మిట్టపల్లి పంచాయతీని ఎంపీవో అనిల్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటి చెత్తను సేకరించాలన్నారు. తర్వాత సెగ్రిగేషన్ షెడ్లు పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

'రైతులపై లాఠీచార్జీ హేయమైన చర్య'

జన్నారం: ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో విత్తన షాపుల వద్ద పత్తి విత్తనాల కోసం వచ్చిన రైతులపై పోలీసులు లాఠీచార్జి చేయడం హేయమైన చర్య చింతగూడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కమ్మల విజయధర్మా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులకు విత్తనాలు సరఫరా చేశాయని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులపై లాఠీచార్జి చేయించడంతో పాతరోజులు వచ్చాయని పేర్కొన్నారు.

సామగ్రి అందజేత

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లికి చెందిన నిరుపేద బొట్ల స్వామి, ఇంటికి తలుపు, ఇంటి పైకప్పునకు టార్పాలిన్ కవర్‌ను మాజీ సర్పంచ్ రజనీ మంగళవారం అందించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

తాండూర్: రైతులకు సబ్సిడీపై అందించేందుకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో కిరణ్మయి ఓ ప్రకటనలో తెలిపారు. 30 కిలోల బస్తాకు రైతులు సబ్సిడీ పోను రూ.1116 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విత్తనాలు కావల్సిన రైతులు పీఏసీఎస్‌లో సంప్రదించాలని సూచించారు.

యూనిఫారంల పరిశీలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల సమాఖ ఆధ్వర్యంలో గుడిపేట మహిళా శక్తి కుట్టుకేంద్రంలో కుట్టించిన పాఠశాల యూనిఫారంలను డీఆర్‌డీవో కిషన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 37 పాఠశాలల్లో 1,997 మందిలో 979 మంది విద్యార్థినులు, 1,018 మంది విద్యార్థులు ఉన్నారని వీరందరికీ ఉచిత యూనిఫారంలను మండల సమాఖ్య ఆధ్వర్యంలో కుట్టిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో డ్రెస్‌కు రూ.75 కుట్టు కూలీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 5 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 209 మంది యూనిఫారంలను స్వీకరించి హెచ్‌ఎంలకు పంపిణీ చేశామన్నారు. ఎంఈవో పోచయ్య, ఐకేపీ ఏపీఎం రాజన్న, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.